సందడిగా బతుకమ్మ వేడుకలు



హెచ్‌ఏఎల్ మెయిన్‌గేటు ఎదురుగా బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

బాలానగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ హిందుస్తాన్ ఏరోనాటికల్స్ (హెచ్ఏఎల్)లో మంగళవారం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. వేడుకల్లో హెచ్ఏఎల్ చీఫ్ డిజైన్ నాగేశ్, వెల్ఫేర్ ఫండ్ చైర్మన్ శ్రీహరిరావు, హెచ్ఏఎల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ ప్రభుత్వ దవాఖానా ప్రాంగణంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డా.శోభరాజ్, డా.మల్లేశ్వరి, డా.మమత తదితరులు.

కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

నిజాంపేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిజాంపేట్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, పార్టీ నాయకుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, కుమార్‌యాదవ్, దివాకర్, వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీనివాస్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు.



శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో కొలన్ హన్మంత్ రెడ్డి



కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పలు కాలనీలకు చెందిన మహిళలు, యువకులు



రూలర్ స్కేటింగ్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ విద్యార్థుల హవా

నిజాంపేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఇంటర్ జిల్లా రూలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో నిజాంపేట ఆర్‌జె ఇనిస్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటారు. భువనగిరిలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జరిగిన చాంపియన్‌షిప్‌లో 2 వందల మీటర్ల విభాగంలో అశ్వితాచౌదరి బ్రాంజ్, 3 వందల విభాగంలో చెర్విక్ రెడ్డి బ్రాంజ్, 4 వందలు మీటర్ల విభాగంలో తారకదీప్‌రెడ్డి, ఆదిత్యలు సిల్వర్ మెండల్స్ సాధించారు.





సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

హరియాణాలో హ్యాట్రిక్ విజయంపై బీజేపీ హర్షం

అల్లాపూర్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించడంతో అల్లాపూర్‌లోని బీజేపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి. మంగళవారం సాయంత్రం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నార్లపురం శ్రీనివాస్, సుదర్శన్ ముదిరాజ్, వెంకటరమణ రెడ్డి, కుమార్‌గుప్తా, నాగరాజ్, గంగాధర్, యాదగిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.





'కడతాల్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి'

దుండిగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వడ్డెర సంఘం నాయకుడు పిట్ల కడతాల్ ఈనెల 5న టోల్ గేట్ వద్ద సంజీవ్‌యాదవ్ అనుచరులు కారు ఆపి, దాడి చేశారని వారిని అరెస్ట్ చేయాలని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కడతాల్‌ను మారయ్య మంగళవారం పరామర్శించారు.

మార్పులకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలి

● ఎస్‌పీఎస్‌యూ వీసీ డాక్టర్ పృథ్వీయాదవ్ ● హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పీఎస్‌యూ వీసీ పృథ్వీయాదవ్, అడ్మిషన్స్ డైరెక్టర్ సంజీవ్ తదితరులు

బంజారాహిల్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా కోర్సుల ఎంపిక ఉండాలని సర్ పదంపత్ సింఘానియా విశ్వ విద్యాలయం(ఎస్‌పీఎస్‌యూ) ఉపకులపతి డాక్టర్ పృథ్వీయాదవ్ అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా సరైన కోర్సులను ఎంచుకున్న విద్యార్థులకే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన సర్ పదంపత్ సింఘానియా యూనివర్సిటీ, అమీర్‌పేట్‌లోని ఎంపీఎం మాల్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా ప్రాంతీయ కార్యాలయాన్ని అడ్మిషన్స్ డైరెక్టర్ సంజీవ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పీఎస్ యూనివర్సిటీ ప్రత్యేకతలను వివరిస్తూ.. టెన్త్, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు యూనివర్సిటీ నుంచి ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న కోర్సులను ఆఫర్ చేస్తున్నామన్నారు. యూనివర్సిటీలలో కాంబినేషన్ కోర్సులకు డిమాండ్ ఉందని, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా డేటాసైన్స్, ఐటీ, సైబర్‌సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులలో విద్యార్థులు చేరేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులపైనా ఎక్కువమంది విద్యార్థులు ఆసక్తిని కనబరుస్తున్నారని వెల్లడించారు. ప్రఖ్యాత కంపెనీలు తమ అవసరాలకు అనుగుణమైన కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో చాలా ప్రైవేట్ సంస్థలు వారికి కావలసిన నైపుణ్యాలపై కోర్సులను రూపొందించి, విద్యార్థులకు నేరుగా ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్లాన్ చేస్తున్నాయని పృథ్వీయాదవ్ పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎస్‌పీఎస్‌యూలో పెయింటింగ్ టెక్నాలజీ కోర్సును పరిచయం చేయబోతున్నట్లు వెల్లడించారు.



తెలంగాణ రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి చిత్రపటానికి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశం విచ్చేసిన శాసన సభాపతి వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

కుత్బుల్లాపూర్/ జీడిమెట్ల/ చందానగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ శ్రీనివాస్‌నగర్ కాలనీ, జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు ఏ.సతీష్ సర్కిల్ ఉపకమిషనర్ నర్సింహకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి వచ్చే నాలాను ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారని తెలిపారు. అధికారుల సహకారంతో కొందరు యథేచ్ఛగా ఫాక్స్‌సాగర్‌ను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నిర్మాణాలను కూల్చివేయకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, అరుణ్‌రావు పాల్గొన్నారు.

చందానగర్: చందానగర్‌లో పీఆర్‌కే ఆస్పత్రి పేరుతో అక్రమ నిర్మాణాలు చేసి రోడ్డును కబ్జా చేశారని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి మగళవారం చందానగర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికి పార్కింగ్ స్థలం లేకుండా స్థానిక ప్రజలను, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహాలక్ష్మీదేవి అలంకరణలో..



రాయదుర్గం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ సాయివైభవ్ కాలనీలో దసరా పర్వదినం పురస్కరించుకుని దుర్గాదేవి మండపంలో జరిగిన చండీహోమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు సత్యనారాయణ, పద్మ, సుజిత్, కృష్ణ, సరస్వతి, రాజు, సత్యనారాయణ, సిద్ధార్థ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, చింతల్ డివిజన్‌లలో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. టి.లక్ష్మారెడ్డి, శ్రీనాథ్‌రావు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ కార్యాలయంలో..

కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్‌లో మంగళవారం మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని సీనియర్ అసిస్టెంట్ ఎడిటర్ వీవీ రమణారావు, మెషిన్‌మెన్ గణేశ్ ఆయన కుటుంబసభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అర్చకులు చక్రధర్‌శర్మ, ఆర్‌ఎం. అనిల్‌కుమార్, సీనియర్ మేనేజర్ రాజేశ్, మహేష్, సాంబశివరావు, సింహాచలం గణేశ్ పాల్గొన్నారు.



ఓల్డుబోయినపల్లి: బేగంపేటలోని పలు మండపాల్లో కొలువైన అమ్మవారికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న గోపన్‌పల్లి, అవంతిక హోమ్స్‌వాసులు

రాయదుర్గం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో రూ.5.27 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన బుధవారం చేయనున్నారు.

● తమ కాలనీలకు సీసీ రోడ్లు మంజూరు చేసిన సందర్భంగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి, అవంతిక హోమ్స్ కాలనీవాసులు ఆయన నివాసంలో మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రిప్రగడ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, సురేష్‌నాయక్, పింటు, శ్రీనివాస్, రాకేష్, రాజేందర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● **మియాపూర్:** శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌కి చెందిన సయ్యద్ అజార్‌అలీ అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీ పత్రాలను ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి లబ్ధిదారుడి కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు.

ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ ఒప్పందం


ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్న టీహబ్ సీఈవో మహంకాళి శ్రీనివాస్ ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ ప్రతినిధి

రాయదుర్గం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశపు ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ-హబ్ ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్ బ్లాక్ చెయిన్ ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంతో భారతీయ వెబ్-3 స్టార్టప్‌లకు ప్రపంచ స్థాయి బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, వనరులను అందించడం ద్వారా వాటి వృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యమంగా పెట్టుకున్నామని టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్ తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ బోర్డు అంతటా పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో మా భాగస్వామ్యం భారతీయ స్టార్టప్‌లకు కొత్త ఆవిష్కరణలకు, స్కేల్ గణనీయమైన మార్పును తీసుకువస్తుందన్నారు. ప్రపంచస్థాయి బ్లాక్‌చెయిన్ సొల్యూషన్‌లతో భారతీయ స్టార్టప్‌లను సన్నద్ధం చేయడం ద్వారా ఈ సహకారం రంగాల్లో ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణలను నడిపించే అత్యాధునిక ఉత్పత్తులు, సేవలందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ముగిసిన వికీమీడియా టెక్నాలజీ సదస్సు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో మూడు రోజుల పాటు ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) క్యాంపస్‌లో జరిగిన వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్ 2024 మంగళవారం ముగిసింది. ఓపెన్ సోర్స్ టెక్నాలజీ, వికీమీడియా ప్రాజెక్ట్‌లలో తాజా పోకడలు, ఆవిష్కరణల గురించి చర్చించడానికి దేశం నలుమూలల నుంచి 130 మంది సాంకేతిక నిపుణులు, డెవలపర్‌లు, వికీమీడియా కంట్రిబ్యూటర్లు పాల్గొన్నారు. ఇండిక్ మీడియా వికీ డెవలపర్స్ యూజర్ గ్రూప్, వికీమీడియా ఫౌండేషన్ మద్దతుతో నిర్వహించిన ఈ సదస్సులో ఐఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఒకరోజు హ్యాకథాన్ నిర్వహించగా, హోటల్ హయత్ గచ్చిబౌలిలో సమ్మిట్ జరిగింది. 'వికీ టెక్ ఫర్ ఆల్: ఎంపవరింగ్ వాయిసెస్, ఎక్స్‌పాండింగ్ హారిజన్స్' అనే పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో వికీపీడియా, వికీమీడియా ప్రాజెక్ట్‌లలో ప్రత్యేకించి చిన్న భాషా సంఘాల కోసం ఇంక్లూజివిటీ పెంపొందించడంపై దృష్టి పెట్టింది. 'ఇండిక్-లాంగ్వేజ్ కమ్యూనిటీలకు, అందుబాటులో ఉన్న సాంకేతిక మద్దతును పెంచాలనే తమ దీర్ఘకాలిక ప్రయత్నంలో మరో విజయవంతమైన కార్యక్రమం, వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్ 2024' అని ఐఐఐటీ హైదరాబాద్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలను అందిస్తున్న ప్రొఫెసర్ రాధికా మామిడి తెలిపారు. ఈ సంవత్సరం సమ్మిట్ వికీమీడియా ప్రాజెక్ట్‌లు, కమ్యూనిటీల టెక్నికల్ ఔట్రీచ్ ప్రోగ్రామ్‌ల ద్వారా లింగ అంతరాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టిందని ఐఐఐటీ హైదరాబాద్‌లో లాంగ్వేజ్ టెక్నాలజీస్ రీసెర్చ్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ వాసుదేవవర్మ అన్నారు.

సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు రికవరీ

రూ. 21.55 లక్షలు బాధితుల ఖాతాల్లో జమ

హైదరాబాద్‌సిటీ, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు రూ. 21.55 లక్షలను పోలీసులు రికవరీ చేశారు. సాంకేతిక ఆధారాల ద్వారా సైబర్ నేరస్థులు డబ్బును ఏ ఖాతాలకు మళ్లించారో గుర్తించి ఆ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. లీగల్ ప్రొసీడింగ్స్ పూర్తి చేసి నగదును బాధితుల ఖాతాల్లో మంగళవారం జమ చేయించామని డీసీపీ కవిత వెల్లడించారు.

● నగరానికి చెందిన ఓ వృద్ధుడికి సైబర్ నేరగాళ్లు ఇటీవల ఫోన్ చేశారు. మీ ఫోన్ నంబర్ బ్లాక్ చేస్తున్నామని, మీ మీద క్రిమినల్ కేసు నమోదైందని సీబీఐ అధికారుల్లా మాట్లాడి భయపెట్టారు. మనీల్యాండరింగ్‌లో మీ హస్తం ఉందని, బ్యాంకు ఖాతా తనిఖీ చేయాలని బెదిరించి రూ. 8,05,331 కాజేశారు. బాధితుడు వెంటనే సిటీసైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.13.5 లక్షలు కాజేశారు. బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించి సైబర్ నేరగాళ్ల ఖాతాలను స్తంభింపజేసి డబ్బును రికవరీ చేశారు.

సొంతిల్లు పోయింది.. శోకమే మిగిలింది

(7వ పేజీ తరువాయి)

ఆ సంఖ్య 288కు చేరింది. రోజు విడిచి రోజు నీళ్ల సరఫరా చేసినా కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదని సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే, వేసవిలో, పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని నిర్వాసితురాలు హసీనా ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నివందల కుటుంబాలు నివసించే అంతపెద్ద భవనాల్లో అగ్ని ప్రమాదాలను ముందస్తుగా హెచ్చరించే స్మోక్ అలారమ్స్, అగ్నిమాపక నివారణ పరికరాలు లేవు.

'డబుల్' అవస్థలు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో తమ అవస్థలు రెట్టింపు అయ్యాయని షేక్ రఫీమహ్మద్ కుటుంబం చెబుతోంది. కొన్ని ఇళ్ళల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. గదుల్లో సామగ్రి పెట్టడానికి అల్మారాలు లేవు. మేకు కొడితే సిమెంట్ పెచ్చులు ఊడిపోయేంత నాసిరకంగా గోడలు ఉన్నాయని నివాసితులు చెబుతున్నారు.

ఒక్క రూపాయీ ఇవ్వలేదు

మూసీ నిర్వాసితుల్లో ఒక్కో కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, రూ. 25వేలు పరిహారంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సామగ్రిని కూడా ఉచితంగా తరలిస్తామని హామీ ఇచ్చింది. తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు తప్ప, పరిహారం అందలేదని బాధితులు వాపోతున్నారు.

విడిపోయిన కుటుంబాలు

శంకర్‌నగర్, మూసానగర్ నిర్వాసితుల్లో ఉమ్మడి కుటుంబాల సంఖ్య ఎక్కువ. కలిసిమెలసి జీవిస్తున్న వారి జీవితాల్లో మూసీ అభివృద్ధి ప్రాజెక్టు పెద్ద కుదుపు. అది వారి ఉమ్మడి సంస్కృతిని విచ్ఛిన్నం చేసిందనే చెప్పాలి. పెద్దలు, పిల్లలతో కలిపి పదిమందికిపైగా ఉన్న కుటుంబాలకు సైతం ఒక్కటే డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కేటాయించారు. అందులో అంతమంది నివసించడం కుదరక దాన్ని తల్లిదండ్రులకు వదిలి, పిల్లలు తలో దిక్కుకు వెళ్లారు.

పిల్లలు స్కూల్ మానేసే ప్రమాదం



నేను ఆటో డ్రైవర్‌ను. శంకర్ నగర్ ఖాళీచేసి డబుల్‌బెడ్ రూమ్ ఫ్లాట్‌లోకి వెళ్లాం. ఇక్కడ మాకు అన్నీ కష్టాలే. వండుకోడానికి కూడా బిందెడు నీళ్లలేవు. డ్రైనేజీ పైపు సక్రమంగా లేకపోవడంతో మురుగు వాసన. మా బస్తీ పిల్లలంతా చాదర్‌ఘాట్ చుట్టుపక్కల స్కూళ్లల్లో చదువుతున్నారు. ఇకమీదట వారంతా స్కూల్‌కు ఆటోలో, బస్‌లో వెళ్లాలి. దసరా సెలవుల తర్వాత మూసీ నిర్వాసితుల పిల్లలు చాలామంది చదువు మానేయడం, లేదా సక్రమంగా వెళ్లకపోవచ్చు. ఇలాంటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

\- మహమ్మద్ ఇక్బాల్, శంకర్‌నగర్

జీవనాధారం కోల్పోయాం



నాకు నలుగురు ఆడపిల్లలు, కొడుకు, కుమార్తెకు పెళ్లయింది. అందరం కలిసే ఉంటాం. నా భర్త అనారోగ్యంతో కొన్నాళ్ల కిందట చనిపోయాడు. శంకర్‌నగర్ నుంచి మమ్మల్ని రెండు రోజుల ముందే ఖాళీ చేయించారు. ఎనిమిదిమందికి ఒకటే ఫ్లాట్ కేటాయించారు. బస్తీలోని వారందరూ మా మూడో అమ్మాయితో దుస్తులు కుట్టించుకునేవారు. జీవనాధారం పోయింది.

\- సారాఖాతుమ్, శంకర్ నగర్

కుల దైవానికి మొక్కి.. చోరీల వేటకు

(7వ పేజీ తరువాయి)

ఆధారాలతో రెండు ముఠాలను పట్టుకున్న పోలీసులు మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.11,500, ఆరు కత్తులు, రెండు రాడ్లు, రెండు కట్టర్లు, 4 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో ఆసక్తికర విషయాలు

అరెస్ట్ అయిన దొంగల ముఠాను సీసీఎస్ పోలీసులు విచారించగా.. ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం థార్ జిల్లా గిరిజన తెగకు చెందిన వీరు చోరీల కోసం బయల్దేరేటప్పుడు అక్కడ కులదైవానికి మొక్కుకొని కత్తులు, రాడ్లు, కట్టర్లతో వెళ్తారు. చోరీలు చేసి సొత్తును ఇండోర్‌లో అమ్మిన తర్వాత గ్రామాలకు వెళ్లి అమ్మవారి వద్ద మొక్కు తీర్చుకుంటారు. తర్వాత ఆ డబ్బుతో జల్సాలు చేస్తూ.. లగ్జరీ జీవితాన్ని అనుభవిస్తున్నట్లు తేలింది. ఇప్పటి వరకు 2 కిలోల బంగారం, 10 కిలోల వెండి, రూ. 8.50 లక్షలు చోరీచేసినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మొత్తం సొత్తును రికవరీ చేయడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు క్రైమ్స్ డీసీపీ నరసింహ తెలిపారు.

గుంతలు పూడ్చండి.. చెత్త తొలగించండి

(7వ పేజీ తరువాయి)

వాహనాల్లో తరలించాలన్నారు.

వ్యర్థాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్

రహదారుల స్వీపింగ్ నుంచి ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం వరకు పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. మంగళవారం కమిషనర్ ఆమ్రపాలి పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై సమగ్ర వ్యర్థాల మెరుగైన నిర్వహణకు వినూత్న పరిష్కార మార్గాలు, ఐసీసీసీ నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వ్యర్థాల నిర్వహణ, సుస్థిరతకు సంబంధించి 11 కంపెనీల ప్రతినిధులు తమ వద్ద ఉన్న ప్రణాళికలు వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు రఘుప్రసాద్, స్నేహ శబరీష్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.